క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు పరామర్శ



ముసునూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. గోపవరానికి చెందిన పార్టీ నేతలు పాతూరి ప్రసాద్, మూతినేని సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం రాత్రి మండల పార్టీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలతో కలిసి గోపవరం చేరుకున్నారు. ముందుగా దివంగత నేతల చిత్ర పటాల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచర్ల వాణి, స్టేట్ హిస్టరీ అకాడమీ మాజీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ విజయవాడ డివిజనల్ కార్యదర్శి బీవీ నాయక్ అన్నారు. ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసోసియేషన్ నేతలు, కార్మికుల సమన్వయంతో ముందుకు నడవాలని సూచించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యదర్శి బీవీ నాయక్, కోశాధికారి బండారు విజయ రాజును సత్కరించారు. నాయకులు దేవర బాలరాజు, కె. లాలియా నాయక్, అంగడి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



తిరువూరు: ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం విద్యార్థులు, తల్లి దండ్రులు సత్కరించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. రామయ్య, బి. సూర్య, బి. శ్రీరాములు, పి. సుధాకరరావు, డి. వెంకటేశ్వర్లును ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు ఆధ్వర్యంలో సన్మానించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతాప్ అప్పారావు నాయకులు

నూజివీడు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం 'ఐదు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు' పుస్తకాన్ని ప్రతాప్ అప్పారావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంపద సృష్టిస్తానని, పేదల బతుకుల్లో వెలుగులు తీసుకొస్తానని ఎన్నికల ముందు మాట్లాడిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే లక్షన్నర కోట్లు అప్పులు చేశారని, ఆ సొమ్మును దేనికి వినియోగించారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలన వైఎస్సార్ సీపీ నాయకులపై కక్ష సాధింపులకే తప్ప, ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టవా?

నూజివీడు: పట్టణంలోని ప్రజల సమస్యల పరిష్కారంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో ఏ వీధిలో చూసినా వీధి లైట్లు వెలగక రాత్రి సమయంలో అంధకారంలో ప్రజలు కొట్టుమిట్టాడుతుంటే వెలగని వీధిలైట్ల స్థానంలో నూతన లైట్లు వేయాలనే ఆలోచన కూడా చేయడం లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వాటిని పరిష్కరించకుండా పెడచెవిన పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.40 లక్షల వ్యయంతో వందలాది నూతన వీధి లైట్లను ఏర్పాటు చేశామన్నారు. దీనితో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఈ ఏడాది కాలంగా బైపాస్ రోడ్డులో, మైలవరం రోడ్డులో, రామన్నగూడెం రోడ్డు, జంక్షన్ రోడ్డులో వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలను అంధకారంలో ఉంచుతానంటే సహించేది లేదని, అవసరమైతే పట్టణ ప్రజలతో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తానని హెచ్చరించారు. కమిషనర్ రాజకీయాలను పక్కన పెట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించండి

మాజీ మంత్రి జోగి రమేష్



జోగి రమేష్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యర్రగుంట సుకుంద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జోగి రమేష్‌ను ఇబ్రహీంపట్నంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జోగి రమేష్‌ను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. జోగి రమేష్ మాట్లాడుతూ సమన్వయంతో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని చెప్పారు. వైఎస్సార్ సీపీ జి.కొండూరు మండల కన్వీనర్ జడ రాంబాబు, సీనియర్ నాయకులు మిక్కిలి శేషయ్య, మెండ్యాల దుర్గారావు, పి.నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచి అబ్రహాం, యర్రగుంట గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువులు మావూరి బడిలోనే సాగాలి



ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, సీపీఎం నాయకులు

మైలవరం: పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మైలవరం ఎంఈఓ కార్యాలయం వద్ద కొత్తగూడెం శివారు లక్ష్మీ నరసాపురం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మా పిల్లల చదువు మా ఊరి బడిలోనే కొనసాగించాలని వారు కోరారు. ఈ మేరకు ఎంఈఓ ఎల్.బాలుకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల తల్లితండ్రులు మాట్లాడుతూ లక్ష్మీ నరసాపురం మండల పరిషత్ పాఠశాలలో 19 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరిలో 4, 5 తరగతులు చదువుతున్న 13 మంది విద్యార్థులను రెండున్నర కిలో మీటర్ల దూరంలోని ఎన్టీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన మోడల్ పాఠశాలకు తరలించారని చెప్పారు. దీనితో లక్ష్మీనరసాపురం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గి ఆ పాఠశాల మూతపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. వీరికి సంఘీభావం తెలిపిన సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ లక్ష్మీ నరసాపురం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు సమచారం ఇవ్వకుండా వారి పిల్లలను తరలించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పాఠశాలల విలీనాన్ని విరమించుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లి దండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం



యోగాసనాలు వేస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

మైలవరం: ఆరోగ్యకరమైన సమాజం యోగా ద్వారానే సాధ్యమవుతుందని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పర్యవేక్షణలో స్థానిక విద్యాసంస్థలు అన్నీ సమిష్టిగా యోగాంధ్ర అవగాహన ర్యాలీని బోసు బొమ్మ సెంటర్ నుంచి నూజివీడు రోడ్డులోని అల్ఫా హోటల్ సెంటర్ వరకు శుక్రవారం నిర్వహించాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సుమారు 1300 మంది పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ పాఠశాలలో యోగాభ్యాసం చేశారు. లయన్ ఎస్వీఎస్ నివృతరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జాస్తి వెంకటేశ్వరరావు, ఆలమూరు చంద్రం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చలువాది మధుసూదనరావు, బయన శ్రీనివాసరావు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజారెడ్డి, ఎంఈఓ బాలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి యోగా ఔషధం

నూజివీడు: ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేట్, ప్రభుత్వ విద్యాలయాల్లో శనివారం నిర్వహించనున్న యోగా శిబిరాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

● **ఇబ్రహీంపట్నం:** ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని జాకీర్ హుస్సేన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ అన్నారు. స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాలలో శుక్రవారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సూక్ష్మ వ్యాయామాలు, ధ్యానం, సూర్య నమస్కారాలు, ఆసనాలు సాధన చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాగుల్ మీరా, అధ్యాపకులు రాము, బందగిబేగ్, రవి, కృష్ణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● **భవానీపురం(విజయవాడపశ్చిమ):** యోగ దివ్య మందిరం (ఏపీ యోగ సభ), సీనియర్ సిటిజన్స్ గొల్లపూడి ఆధ్వర్యంలో శుక్రవారం యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా గురువులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, శరత్ కుమార్, రిటైర్డ్ ఎస్ఐ నాంచారయ్య, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పూజారి స్థలాన్ని కాపాడాలని వినతి

చాట్రాయి: చాట్రాయి గ్రామ కోదండ రామాలయం పూజారికి దాతలు ఇచ్చిన భూమిని అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు తహసీల్దార్ ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 264లో సుమారు 5 సెంట్ల నివేశన స్థలాన్ని పూర్వం దాతలు రామాలయ పూజారి నివాసం నిమిత్తం విరాళంగా ఇచ్చారని, ఇపుడు ఆ స్థలాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

తిరువూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యతేజ



తిరువూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని తిరువూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. సూర్యతేజ సూచించారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, పాఠ్య పుస్తకాలు తదితర సదుపాయాలు కల్పిస్తోందన్నారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కొనసాగించాలని ధర్నా



తిరువూరు: కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న యత్నాలతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, తాము ఈ సవరణలను వ్యతిరేకిస్తున్నామని సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మిక చట్టాల రద్దును వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికుల పనిగంటల పెంపు, రాత్రి పూట సైతం మహిళా కార్మికులు పనిచేయాలని ఆదేశించడం తగదన్నారు. సీఐటీయూ నాయకులు నాగరాజు, సురేష్, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో నీతి అయోగ్ బృందం పర్యటన



ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నీతి అయోగ్ బృందం, ఎంపీడీఓ సునీత శర్మ

ఇబ్రహీంపట్నం: ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇబ్రహీంపట్నం బ్లాక్‌లో నీతి అయోగ్ బృందం శుక్రవారం పర్యటించింది. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ఏబీపీ)లో భాగంగా నీతి అయోగ్ బృందం ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ అమలు స్థితిగతులపై సమీక్షించారు. ఎంపీడీఓ సునీత శర్మ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం బ్లాక్‌లో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ విజయవంతంగా అమలవుతోందన్నారు. బ్యాంకింగ్ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నాయని చెప్పారు. ఏబీపీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్లాక్‌లో ఆర్థిక చేరుదలపై తీసుకుంటున్న చర్యలు, వాటి ఫలితాలపై సమగ్ర ప్రెజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా డిజిటల్ లావాదేవీలు, బ్యాంక్ ఖాతాల యాక్టివేషన్‌ను వివరించారు. సర్పంచ్ కవిత, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్, ఏపీఎం శోభన్‌బాబు, వెలుగు సిబ్బంది, కార్యదర్శి మునేశ్వరరావు, మైక్రోసేవ్ ఎస్ఎఫ్ఐసీ రాష్ట్ర ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ బృందం పాల్గొన్నారు.

19 మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు: నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సత్యవతి తెలిపారు. సిబ్బందితో కలిసి నూజివీడు మండలంలో నిర్వహించిన దాడుల్లో అనధికార మద్యాన్ని విక్రయిస్తున్న పల్లెర్లమూడికి చెందిన చోడగిరి వీర్రాజు వద్ద 10 మద్యం సీసాలను, మోర్సపూడికి చెందిన అచ్చి వెంకటేశ్వరరావు వద్ద 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని వారిద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఆమె మాట్లాడుతూ బెల్ట్ షాపుల నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవని, బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లాసెట్‌లో నూజివీడు విద్యార్థికి 134వ ర్యాంకు



వాకా రాహుల్

నూజివీడు: పట్టణానికి చెందిన వాకా రాహుల్ లాసెట్‌లో 134వ ర్యాంకును సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచాడు. బాస్కెట్ బాల్ క్రీడాకారుడైన రాహుల్ తండ్రి వాకా నాగరాజు, తల్లి వనజలు ప్రభుత్వ హైస్కూల్‌లో పీడీలుగా పనిచేస్తున్నారు. లా పూర్తి చేసి న్యాయమూర్తిగా స్థిరపడాలన్నదే తన ధ్యేయమని రాహుల్ పేర్కొన్నారు. రాహుల్‌ను పలువురు అభినందించారు.

ఉద్యోగోన్నతి బాధ్యతను పెంచుతుంది



ఆగిరిపల్లి: ఉద్యోగోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని విద్యుత్ ఏడీ వీరబాబు అన్నారు. ఆగిరిపల్లి విద్యుత్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న వీరబాబుకు ఏడీగా పదోన్నతి లభించడంతో విద్యుత్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ రామారావు, ఆగిరిపల్లి లైన్‌మెన్ శోభన్‌బాబు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే

మైలవరం: రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ కె. మాధురి ఆధ్వర్యంలో రెవెన్యూ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రెవెన్యూ డే పురస్కరించుకుని ర్యాలీ జరిగింది. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు. రెడ్డిగూడెం తహసీల్దార్ సుశీలాదేవి, డెప్యూటీ తహసీల్దార్ సతీష్ కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, సీనియర్ సహాయకులు రవికాంత్, జూనియర్ సహాయకులు వెంకటేష్, వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి



నూజివీడు: పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ ఎస్ఈ తోట శ్రీనివాసరావు అన్నారు. నూజివీడు డివిజన్ సిబ్బందితో పీఎం సూర్య ఘర్‌పై ట్రిపుల్ ఐటీలోని ఆడిటోరియంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్లకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తామన్నారు. బీసీ వినియోగదారులకు అదనంగా రూ.20 వేలు కేంద్ర పథకం కింద సబ్సిడీ ఇస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యుత్ వినియోగదారుడు సోలార్ కింద అప్లికేషన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు ఆదా అవడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని చెప్పారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: దివ్యాంగులు కృత్రిమ కాళ్లతో తమ వైకల్యాన్ని అధిగమించి సాధారణ జీవితం కొనసాగించవచ్చని ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ పీఎల్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో దాత అడుసుమిల్లి ప్రతాప్ కుమార్ అందజేసిన ఆర్థిక సాయంతో దివ్యాంగ బాలుడు మనోజ్ నాయక్‌కు కృత్రిమ కాళ్లను అందజేశారు. హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, సీనియర్ టెక్నీషియన్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు



ఇబ్రహీంపట్నం: కంకర, బూడిద రవాణా చేసే టిప్పర్ లారీ డ్రైవర్లు రహదారి భద్రత నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం వద్ద టిప్పర్ వాహనాల తనిఖీ శుక్రవారం చేపట్టారు. అధికలోడు, పట్టాలు కట్టకుండా బూడిద, కంకర రవాణా చేస్తున్న వాహనాలకు జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనాలపై పట్టాలు కట్టకపోవడం వల్ల బూడిద, కంకర రోడ్డుపై పడి ఇతర వాహనదారులకు ఇబ్బందిగా మారుతోందన్నారు. రోడ్డుపై పడిన మెటీరియల్ ప్రమాదాలకు కారణమవుతోందని చెప్పారు. రహదారి భద్రత పాటించడంతో పాటు వాహన రికార్డులు, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

హైస్కూల్‌కు బీరువా, కుర్చీల బహూకరణ

నూజివీడు: పోతురెడ్డిపల్లి హైస్కూల్‌కు నూజివీడు పట్టణానికి చెందిన దాత వైజయంతి మాల శుక్రవారం ఇనుప బీరువాను, కుర్చీలను బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.రాఘవేంద్ర ప్రసాద్ దాతను ఘనంగా సత్కరించారు.